ఎవరో నీవు తెలుసుకోవటమే నీ జీవిత గమ్యం. నిష్కామకర్మ ఎందుకు చేయమన్నారు, అంటే అది గమ్యం కాదు అయినా నీ గమ్యం చేరటానికి అది నీకు సహకరిస్తుంది అందువలన చేయమని చెప్పారు. నీదేహం ఏదో రోజు శవం అయి తీరుతుంది. అందుచేత నీకు జ్ఞానం కావాలంటే దేహాన్ని ఈ రోజునుండే శవంగా వదిలెయ్యి. అప్పుడు నీ సాధన వేగంగా జరుగుతుంది. నీ మనస్సుకు అంతర్ దృష్టి కలుగుతుంది. చైతన్యస్థాయిలో, బుద్ధి యొక్క పరిణితిలో మనకంటే ఎవరైతే ఎక్కువగా ఉన్నారో వారితో సహవాసం చేస్తే మన బుద్ధి యొక్క పరిణితి పెరుగుతుంది, కర్మరంగం విశాలమవుతుంది, దృష్టి విశాలమవుతుంది, అఖండంగా ఆలోచించగలము. అఖండంగా ఆలోచిస్తేనే అఖండమైన వస్తువును మనం తెలుసుకోగలము.

**(మురమళ్ళలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 26-11-97)**

**ప్రియమైన ఆత్మ బంధువుల్లారా,**

పాదము అంటే మూలము. దేవుని పాదము అంటే నిజమైన పాదము ఎక్కడ ఉంది అంటే నీ మూల తలంపు యొక్క మూలంలోనే ఉంది. అంటే నీ హృదయంలోనే ఉంది. మనస్సును హృదయంలో ఉంచగలిగితే, ముంచగలిగితే, మనస్సు కరిగిపోతుంది. అక్కడఉన్న భగవంతుడు నీకు ప్రత్యక్షమవుతాడు. మనస్సు హృదయంలో ఎంతసేపు ఉండగలదు అంటే నీకు వైరాగ్యం ఉంటే, అభ్యాసం చేస్తూ ఉంటే మనస్సు హృదయంలో ఎంతసేపు అయినా ఉంటుంది. విషయజ్ఞానం ఎప్పటికైనా మరుపు వచ్చేస్తుంది. ఈశరీరంలోనే వయస్సు వచ్చేటప్పటికి మరుపు వచ్చేస్తుంది, ఎందుచేతనంటే అది సొంతం కాదు అది సంపాదించుకొన్నది. కాని ఆత్మజ్ఞానం శాశ్వతమైనది. ఆత్మజ్ఞానం కలగాలంటే ఆడంబరమువలన అదిరాదు. ఎలావస్తుంది అంటే వాక్కును, మనస్సులో లయింప చేయాలి, మనస్సును బుద్ధిలో లయింప చేయాలి, బుద్ధిని దానికి సాక్షిగా ఉన్న ఆత్మలో అంటే హృదయంలో లయింపజేస్తే నీకు ఆత్మశాంతి లభిస్తుంది. వైరాగ్యం కూడా సంపదతో సమానము. బజారులో ఉన్న వస్తువులు కొనటానికి ధనం ఎంత అవసరమో అలాగే ఆత్మజ్ఞానాన్ని సంపాదించటానికి వైరాగ్యం అనే సంపద అంత అవసరం. మీ శరీరం మీ ఇంట్లో ఎలా కాపురం ఉంటుందో అలాగ ఈశ్వరుని నామం మీ నోటిలో కాపురం ఉంటే మీలోని దోషములు అన్నీ హరించి పోతాయి. యజ్ఞాలలో జపయజ్ఞమును నేను అని కృష్ణుడు చెప్పాడు. జపయజ్ఞానికి పైసా ఖర్చు లేదు. ఖర్చులేని పనులు మనకు తేలికగా అనిపిస్తాయి. జపయజ్ఞాన్ని అభ్యాసం చేస్తే మీకు రెండు లాభములు. మీలో ఉన్న దోషములు పోతాయి, మనస్సు దాని మూలం వైపుకు ప్రయాణం చేస్తుంది. పరమ పవిత్రుల యొక్క పాదాలను దర్శించటం వలన కూడా మనస్సు తన మూలంలోనికి వెళ్ళటానికి సహకరిస్తుంది. మనస్సు పూర్తిగా నాశనం అవ్వాలంటే అది దాని మూలమైన హృదయంలో ఎక్కువ కాలం ఉండాలి. మీ ఇంటిలో ఉండి మనస్సును హృదయంలో ఉంచలేకపోతే సహృదయం ఉన్నవారి తోటి, సద్బుద్ధి ఉన్నవారి తోటి సహవాసం చేస్తే మీకు తెలియకుండానే మీ మనస్సు హృదయంలో ఉంటుంది.

వైరాగ్యం వలన మనస్సు బాహ్యంగా విజృంభించటం తగ్గుతుంది విసుగు, విరామం లేకుండా అభ్యాసం చేయటం వలన అది అంతర్ముఖం అవ్వటం ప్రారంభిస్తుంది. అభ్యాసము, వైరాగ్యము రెండూ అవసరమే. జీవభావన అహంభావనను పెంచుతుంది. ఆత్మభావన ఆత్మ వైపుకు తీసుకొని వెళుతుంది. ఈరోజు మనకు ఆత్మభావన ఎప్పుడు వచ్చింది, జీవభావన ఎప్పుడు వచ్చింది అని

ఏరోజుకారోజు మనం చూసుకోవాలి. జీవభావన ఏమైనా తగ్గుతుందా, లేదా అని మనం జాగ్రత్తగా పరిశీలన చేసుకోవాలి. ఆత్మభావన పెరుగుతూ ఉంటే ఆత్మ తన స్వరూపాన్ని ఇస్తుంది. జీవభావన పెరుగుతూ ఉంటే అహంకారము చుట్టూ తిరుగుతూ ఉంటాము ఇలాగ అనేక శవాలను మోస్తూ ఉండవలసిందే. మాకు సుఖం లేదు, శాంతి లేదు అంటారు. మీకు నిజంగా శాంతి కావాలంటే అది ఎక్కడ ఉందో అక్కడకు వెళ్లండి అది మీకు దొరుకుతుంది. లోకంలో ఉన్న సుఖాలు అస్వతంత్రమైనవి. కాని ఆత్మసుఖం స్వతంత్రమైనది. ఎంత అనుభవించినా అది తరగదు. ఏ క్షణానికి ఆక్షణం కొత్తగా ఉంటుంది. దాని వైభవం అటువంటిది.

భగవంతుడు చెప్పిన మాటలు విన్నప్పుడు, ధ్యానం చేసుకొన్నప్పుడు, సత్పురుషుల సహవాసం చేసినప్పుడు శాంతిగా, ఆనందముగా ఉన్నాము అనిపిస్తుంది. అది ఎక్కువ సేపు నిలబడదు. జన్మాంతరములో నుండి వచ్చిన వాసన దానిని ఆటంక పరుస్తుంది వాసన పూర్తిగా నశిస్తే గాని మీరు పొందిన శాంతి శాశ్వతం అవ్వదు. నీలో ఏమైనా చెడు వాసనలు ఉంటే చెడు వాసనలు వచ్చాయి ఏమిటి ? ఇలా ఇబ్బంది పెడుతున్నాయి ఏమిటి ? ఇంక మనం చనిపోదాము అని అనుకోకూడదు. చెడువాసనలను తొలగించుకోవటానికి ప్రయత్నం చేయాలిగాని ఏడుస్తూ కూర్చోకూడదు. కాలుకు పేడ అంటుకొంటే కాలును నరికేసుకోము. నీటితో శుభ్రంగా కడుక్కొంటాము. అలాగే నీలో చెడు వాసనలు ఉంటే భగవంతుని ధ్యానించి, సత్పురుషులను ఆశ్రయించి ఆ వాసనను పోగొట్టుకోవటానికి ప్రయత్నం చేయాలి. మీరు ఏదైనా పొరపాటు చేస్తే పొరపాటు చేసాను అని అనుకోవద్దు ఆత్మకు పొరపాటు లేదు. పొరపాటు అనేది మనస్సుకు సంబంధించినది. అది మధ్యలో వచ్చింది కాబట్టి మీరు సాధన చేస్తే పోతుంది.

భగవంతుడు చెప్పిన ప్రతిమాట యదార్థమే. మనకు అర్హత, యోగ్యత లేక ఆమాటయందు గౌరవం కలగటం లేదు. భగవంతుడు చెప్పిన మాటలు చాలా సూక్ష్మంగా ఉంటాయి. స్థూలబుద్ధి ఉన్నవాడికి ఆమాట అర్థంకాదు. ఏ సూక్ష్మబుద్ధితో అయితే భగవంతుడు ఆమాట చెప్పాడో అటువంటి సూక్ష్మ బుద్ధిని మనం సంపాదిస్తే ఆ మాట యొక్క విలువ మనకు తెలుస్తుంది. నీకు సూక్ష్మబుద్ధి కావాలంటే మనస్సు యొక్క మాలిన్యం పోవాలి. మనస్సులో ఉన్న మాలిన్యం ఎప్పుడైతే పోయిందో అది పరిశుద్ధమైన గంతులు వేసుకొంటూ హృదయంలోనికి వెళ్లి అక్కడ కరిగిపోతుంది. మనస్సు శిరస్సులో ఉంటే దేహబుద్ధి పెరిగిపోతుంది. మనస్సు హృదయం లోనికి వెళితే దేహబుద్ధి తగ్గిపోతుంది. దేహబుద్ధి అంటే దేహగతమైననేను హృదయంలో కరిగిపోయినపుడు నిజమైననేను నీకు వ్యక్తమవుతుంది. అప్పుడు మీరు విశ్వమానవులు అవుతారు. ఇప్పుడు మీరు నివసించే ఇల్లుమీది అనే భావన మీకు ఎలా ఉందో మనస్సు హృదయాకారం చెందినపుడు ఈ సృష్టి అంతానాదే అనే ఆఖండమైన భావన వస్తుంది. జపం చేసేటప్పుడు ధ్యానం చేసేటప్పుడు బాగానే ఉంటోంది, బయటకు వచ్చేటప్పటికి దేహబుద్ధి వచ్చేస్తోంది, అని అడిగితే నీవు కంగారుపడవద్దు. ఆత్మభావన అభ్యాసం చేస్తూఉంటే నెమ్మదిగా దేహభావన తగ్గుతుంది. ఆత్మభావన ఎప్పుడైతే పెరిగిందో ఆత్మతో తాదాప్యం వస్తుంది. ఆత్మతో తాదాప్యం వచ్చిన తరువాత దేహం ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే. ఆత్మకు చావు లేదు, పుట్టుక లేదు, ఆత్మతో తాదాప్యం వచ్చినప్పుడు చావు పుట్టుక లేని స్థితికి ఎదిగి వెళ్లిపోతావు.

సినిమా చూడాలనే తలంపు మీ కళ్లకు రావటం లేదు. మనస్సుకు వస్తోంది. ఆ తలంపు వచ్చాక

ఈ శవాన్ని తీసుకొని వెళ్లి సినిమా హాలులో పడేస్తారు. సినిమా బొమ్మలను ఎవరు చూస్తున్నారు ? మీ కళ్ళు చూడటం లేదు. కళ్ళద్వారా ఆతలంపు చూస్తోంది. కళ్ళు నిజమైన ఇంద్రియాలు కావు. అవి స్మశానంలో కాలి పోతాయి. కళ్ళ ద్వారా చూసే తలంపు మాత్రం స్మశానంలో కాలదు. ఎందుచేతనంటే అది మనస్సులో ఒక భాగము. మనస్సుకు శరీరానికి ఇసుమంతయు కూడా సంబంధం లేదు. శరీరం స్మశానం కాలిపోయినప్పడు అలవాట్లు కాలవు. ఎందుచేతనంటే అలవాట్లు శరీరంలో లేవు, మనస్సులో ఉన్నాయి. మీకు తలంపు వచ్చినప్పడు ఆ తలంపు ఎలా చెపితే అలా శవాన్ని తిప్పితే తలంపులు పెరుగుతాయి. తలంపులను ఆచరణలో పెట్టకపోతే తలంపులు బలహీనపడతాయి. ఈవిషయం అర్థం చేసుకోండి. ప్రేరణ కలగజేసే ఇంద్రియాలు మనస్సులో ఉంటాయి. అవి స్మశానంలో కాలవు. గోళాలు స్మశానంలో కాలిపోతాయి. గాఢనిద్రలో మనం కాని విషయముల నుండి విడిపోతున్నాము. నువ్వు కాని దేహం నుండి, నువ్వుకాని విషయములనుండి, నువ్వుకాని అలవాట్లనుండి నీవు విడిపోగలవు కాని నీలో నుండి నీవు విడిపోలేవు. నీవు ఏదైతే కాదో అదే నువ్వు అనుకొంటున్నావు. ఆపొరపాటు నుండి నిన్ను విడుదల చేయటానికి గురువు ప్రయత్నిస్తాడు. దానికి ఒకజన్మ పట్టవచ్చు, అనేక జన్మలు పట్టవచ్చు. గురువుకి నీ మీద ఉన్న ప్రేమ అకారణమైనది. కాబట్టి ఆయన ఏ అంతస్థులో ఉన్నాడో ఆ అంతస్థుకి తీసుకొనిపోయే వరకు నిన్ను విడిచిపెట్టడు. పూర్వజన్మలో సాధన చేయకపోతే ఈ జన్మలో కష్టంగా ఉంటుంది. పూర్వజన్మలో సాధన చేస్తే ఈజన్మలో సాధన తేలిక అవుతుంది. పూర్వజన్మలో సాధన చేయలేదు అని వూరుకోకండి. ఇప్పడు ప్రారంభించండి. చిన్న సాధన చేసినా సరిపోతుంది. సాధన ప్రారంభించండి. సాధనయొక్క రుచి తెలిస్తే ఆరుచే మీ చేత సాధన చేయిస్తుంది. ఈ శరీరానికి చాలా గౌరవం ఉంది, ఈశరీరాకి గౌరవంలేదు. ఈ శరీరం చాలామందికి ఉపకారం చేసింది, ఈ శరీరం చాలమందికి అపకారం చేసింది, మేము ఎక్కువవారము, మేము తక్కువవారము అని అనుకోవద్దు. ఈ రెండు అహంభావనను పెంచుతాయి. మీరు అలాగ ఉండవద్దు, మీరు ఇలాగ ఉండవద్దు. మీరు ఎవరుగా ఉన్నారో వారుగా ఉండండి. దానివలన వాసనలు తగ్గుతాయి. మీరు చేసిన మంచిని రోజూ మనస్సులో రిపీట్ చేసుకొన్నా అజ్ఞానం పెరుగుతుంది.

తలంపులు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. ఆత్మచింతనను విడిచి పెట్టవద్దు. మీ జీవితంలో అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి. అక్కడ ఆగిపోకూడదు. ఈ భూమి మీదకు వచ్చిన పని మర్చిపోకూడదు. జీవుడిని పతనం చేయటానికి ఈలోకంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి. ఒక్క ఆకర్షణకులోబడిన మనం పతనమవుతాము. ఇన్ని ఆకర్షణల మధ్యన గమ్యమును మర్చిపోకుండా సాధన చేయాలి. సాధన లేకుండా సిద్ధి కలుగదు. ఇంట్లో ఎవరైనా మిమ్మల్ని కష్టమైన మాటలు అన్నా అవి పట్టించుకోవద్దు. మీ సాధనకు వాటిని ఉపయోగించుకోండి. నీలో ఈపొరపాటు ఉంది అని గురువు చెప్పడు. నీకు తెలియకుండా ఆ పొరపాటునుండి విడుదల చేయటానికి ప్రయత్నిస్తాడు. మీ బట్టల మీద పురుగును పాకుతోంది అని ఎవరైనా చెపితే వారితో పేచి పెట్టుకోరు ఆ పురుగు తీసేస్తారు. అలాగే మీలో ఏదైనాలోపం ఉంది అని ఎవరైనా చెపితే వారిమీద కోపం తెచ్చుకోవద్దు. ఆలోపాన్ని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయండి. ఇతరులకు మనం శారీరకంగా సహాయ సహకారములు ఇవ్వలేకపోయిన మనస్సులో వారి క్షేమాన్ని కోరుకోవాలి. ఆసామాజిక స్పృహతో జీవిస్తే ఆత్మజ్ఞానానికి అది సహకరిస్తుంది.